**ఉమ్మడి జిల్లాలో** 'ఇసుకాసురుల'కు అడ్డూ అదుపు లేకుండా పోతున్నది. ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించినా..క్షేత్రస్థాయిలో పట్టించుకున్న దాఖలాలు లేవు. అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుండడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. కొన్నిరోజులుగా ఇసుక దందాలో కేటుగాళ్లు రూటు మార్చారు. ప్రభుత్వ నిర్మాణాల పేరిట తీసుకుంటున్న వేబిల్లులను అడ్డు పెట్టుకొని ఇసుక అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నారు. మొన్నటి వరకు జీరో దందాతో చెలరేగి పోయిన అధికార పార్టీ నేతలు, వారి అనుచరగణం ఇప్పుడేకంగా వే బిల్లుల పేరిట మాయాజాలం చేస్తున్నది. ఇందుకు రెవెన్యూ శాఖ ఉద్యోగులు బాహాటంగా సహకారం అందిస్తున్నారు. తాజాగా బోధన్‌లో ఓ ఇసుక వ్యాపారి ఆడియో లీకేజీ బయటికి రావడంతో ఇసుక దందాలో ఎంతటి అవినీతి జరుగుతున్నదో తేటతెల్లమైంది. వేబిల్లుల జారీ కోసం తహసీల్దార్లు యథేచ్ఛగా డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లుగా ఆడియోలో ఇసుక వ్యాపారి ప్రధానంగా ఆరోపణలు చేయడం గమనార్హం.

–నిజామాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

## సీఎం ఆదేశాలు బేఖాతరు

సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలను ఉమ్మడి జిల్లాలో బుట్టదాఖలు చేస్తున్నారు. కలెక్టర్ల నుంచి కింది స్థాయి రెవెన్యూ ఉద్యోగి వరకూ పట్టించుకున్న దాఖలాలు కనిపించడంలేదు. సహజ వనరులను కొల్లగొట్టే అక్రమార్కులపై ఉక్కుపాదం మోపాలని సీఎం పదేపదే చెబుతున్నారు. సొంత పార్టీకి చెందిన నేతలైనా వదిలేదిలేదని స్పష్టం చేశారు. క్షేత్ర స్థాయిలో పరిస్థితి మాత్రం ఇందుకు భిన్నంగా ఉన్నది. సీఎం ఆదేశాలతో ఇన్‌చార్జి సీపీగా, కామారెడ్డి ఎస్పీగా సింధూ శర్మ ఉన్నప్పుడు తూతూ మంత్రంగా ప్రెస్‌నోట్ విడుదల చేశారు. అక్రమార్కులను వదిలేది లేదంటూ హెచ్చరికలు జారీ చేశారు. అయినప్పటికీ నియంత్రణ చేయలేకపోయారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు కొత్త సీపీ, ఎస్పీలు వచ్చారు. ఇసుక అక్రమాలపై వారి ఫోకస్ ఎలా ఉండబోతుందనేది ఇంకొన్ని రోజులైతే కానీ తెలిసే పరిస్థితి కనిపించడం లేదు. సీఎం ఆదేశాలను కలెక్టర్లు సైతం పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఒక వే బిల్లు పేరిట పదింతల ట్రిప్పుల ఇసుకను తరలిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. అక్రమార్కులకు అడ్డుకట్ట వేసేందుకు ముందు రెవెన్యూ శాఖలో అధికారుల తీరుపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## ఇసుక దందాపై ఫిర్యాదు చేయవచ్చు..

అనుమతి లేకుండా ఇసుకను తరలించరాదు. సరైన పత్రాలు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే ప్రజలెవరైనా ఫిర్యాదు చేయవచ్చు. ఇసుక అక్రమాలను నియంత్రించే అధికారం మాకన్నా ఎక్కువగా రెవెన్యూ శాఖకే ఉన్నది. రెవెన్యూ శాఖనే పూర్తి బాధ్యత వహిస్తుంది. తహసీల్దార్ల ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించాలి. ఇసుక అక్రమంగా తరలిస్తున్న వాహనాలను పట్టుకుని మాకు అప్పగిస్తే మేము పెనాల్టీ విధిస్తాం.

**- విజయ్ కుమార్ రాథోడ్, గనులు, భూగర్భ శాఖ అధికారి, నిజామాబాద్**

# అవే బిల్లులు వందల ట్రిప్పులు

## యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా


- బాహాటంగానే సహకారం అందిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు
- బోధన్ వ్యాపారి ఆడియో లీక్‌తో ఇసుక దందా బహిర్గతం
- ఉమ్మడి జిల్లాలో ముఖ్యమంత్రి ఆదేశాలు బేఖాతరు
- మంజీరా పరీవాహక ప్రాంతంలో అవినీతి జలగల తిష్ట!

**ఉమ్మడి** జిల్లాలో ఇసుకాసురులకు కొంతమంది తహసీల్దార్లు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకారం అందిస్తున్నారు. కాసులకు కక్కుర్తి పడి యథేచ్ఛగా వే బిల్లులు జారీ చేస్తున్నారు. ఈ అక్రమ తంతుపై ప్రభుత్వ ఉన్నతాధికారులు ఉదాసీనంగా వ్యవరిస్తుండడం అక్రమార్కులకు కలిసి వస్తున్నది. బోధన్ వ్యవహారంలో ఉన్నతాధికారులు విచారణకు ఆదేశిస్తే రెవెన్యూ లీలలు బహిర్గతమయ్యే ఆస్కారం ఉంది. కానీ నిజామాబాద్‌లో ఉన్నతాధికారులు మౌనంగా ఉండడం, కండ్ల ముందే సహజ వనరులను అక్రమార్కులు కొల్లగొడుతున్నప్పటికీ ఏమీ పట్టనట్లుగా వ్యవహరిస్తుండడం పలు అనుమానాలకు తావిస్తున్నది.




### మంజీరాలో అవినీతి జలగలు

ఉమ్మడి జిల్లాలోని జుక్కల్, బాన్సువాడ, బోధన్ నియోజకవర్గాల్లో ఉన్న మంజీరా పరీవాహక ప్రాంతంలో ఇసుక దోపిడీ జోరుగా సాగుతున్నది. అధికారిక క్వారీలు మూసేసి దొడ్డి దారిన దోపిడీని కాంగ్రెస్ పాలకులు ప్రోత్సహిస్తున్నారు. ప్రభుత్వానికి రూ.కోట్లలో రావాల్సిన ఆదాయం పడిపోగా అక్రమార్కుల జేబులు మాత్రం రోజూ గలగలమంటున్నాయి. అధికార పార్టీ నేతల అండదండలతో చెలరేగిపోతున్న ఇసుక మాఫియాకు పలువురు రెవెన్యూ అధికారుల సహకారం కూడా ఉన్నట్లు తెలుస్తున్నది. ఇందులో బిచ్కుంద, బీర్కూర్, డోంగ్లి, బాన్సువాడ, నస్రుల్లాబాద్, కోటగిరి, పొతంగల్, బోధన్ మండలాల్లో రెవెన్యూ అధికారుల పాత్ర ఉన్నట్లు సమాచారం. బోధన్ డివిజన్‌లో తహసీల్దార్‌గా పని చేసి అప్రతిష్టను మూటగట్టుకున్న ఓ అధికారి ఇప్పుడు మంజీరా పరీవాహక ప్రాంతంలో తిష్టవేశాడు. తనకు ఇష్టమొచ్చినట్లుగా వేబిల్లులు జారీ చేస్తూ అందినకాడికి దోచుకుంటున్నాడు. కామారెడ్డి జిల్లాలో తాజాగా జరిగిన తహసీల్దార్ల బదిలీల్లో మంజీరా పరీవాహక ప్రాంతానికి ఓ ప్రజాప్రతినిధితో పైరవీ చేయించుకుని ఓ తహసీల్దార్ పోస్టింగ్ తెచ్చుకున్నాడు. ఇసుక అక్రమాలకు రాచబాట వేసేందుకు సదరు అధికారి వచ్చినట్లు రెవెన్యూ వర్గాలు గుసగుసలాడుతున్నాయి. అవినీతి, అక్రమాలకు కేరాఫ్‌గా ముద్రపడిన సదరు అధికారికి ఓ పోలీసు అధికారి మద్దతు ఇస్తున్నట్లు సమాచారం. ఇద్దరు కలిసి ఇసుకను కొల్లగొట్టే ప్రణాళికను ప్రజాప్రతినిధి అండదండలతో రచిస్తున్నట్లుగా తెలిసింది. గతంలో బోధన్ డివిజన్ కేంద్రంలో పని చేసి ఇప్పుడు బాన్సువాడ డివిజన్‌లో పని చేస్తున్న తహసీల్దార్ సైతం పాత్రధారిగా నిలుస్తున్నట్లుగా ఆరోపణలున్నాయి. రెవెన్యూ శాఖలో కళంకితులుగా ముద్రపడిన సదరు అధికారులందరూ మంజీరాలో తిష్టవేసినా నిఘా వర్గాలు పట్టించుకోకపోవడం గమనార్హం.






పట్టుబడిన టిప్పర్, జేసీబీలతో వాహనాల డ్రైవర్లు

## ఇసుక క్వారీపై టాస్క్‌ఫోర్స్ దాడి

### 9 టిప్పర్లు, మూడు జేసీబీలు స్వాధీనం

బోధన్, మార్చి 25: సాలూరా మండలం మందర్న క్వారీపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం రాత్రి దాడిచేసి 9 టిప్పర్లు, మూడు జేసీబీలను స్వాధీనం చేసుకున్నారు. టిప్పర్లు, జేసీబీలకు సంబంధించిన 12 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి అడిషనల్ డీసీపీ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో క్వారీపై ఆకస్మిక దాడి చేశారు. దాడిలో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ అంజయ్య, సబ్ ఇన్‌స్పెక్టర్ గోవింద్, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

## నీళ్లను కొనుగోలు చేసుకుంటున్న కాలనీవాసులు
## నూతన బోరు,పైప్‌లైన్ కోసం నిధులు మంజూరైనా పట్టించుకోని అధికారులు, నాయకులు



కుళాయి నుంచి సన్నగా వస్తున్న నీటిని పట్టుకుంటున్న మహిళలు

# రాంనగర్‌లో తాగునీటి ఎద్దడి

**సరిపడా 'భగీరథ' నీరందక తప్పని తిప్పలు**

సారంగాపూర్, మార్చి 25: జిల్లాలోని పలు గ్రామాల్లో వేసవికి ముం దే తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. నిజామాబాద్ రూరల్ మండలంలోని రాంనగర్ గుట్ట ప్రాంతం లో నివాసిస్తున్న ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ 20వేల లీటర్ల సామర్థ్యంతో వాటర్ ట్యాంక్‌ను నిర్మించారు. ట్యాంకు ద్వారా కాలనీవాసులకు మిషన్ భగీరథ నీరు సరిపడా సరఫరా కాకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారు. నెలరోజుల నుంచి కుళాయి నీరు సరిపడా రానందున, కొనుక్కోవాల్సిన దుస్థితి దాపురించిందని మహిళలు వాపోతున్నారు. వారం రోజుల క్రితం కేవలం రెండు రోజులు మాత్రమే ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేశారని తెలిపారు.

### మంజూరైన బోరు వెంటనే వేయించాలి..

కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి బోరు, పైపులైన్ కోసం రూ. లక్షా 50 వేల నిధులు మంజూరు చేసి ఆరు నెలలు గడుస్తున్నా ఇంతవరకు బోరు వేయించే నాథుడే కరువయ్యాడు. అధికార పార్టీకి చెందిన ఓ గ్రామ నాయకుడికి బోరు వేసే బాధ్యత ను పార్టీ పెద్దలు చెప్పినా కూడా ప్రయోజనం లేకుండా పోయిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో రూ.17 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేందుకు శ్రద్ధ చూపిన సదరు నాయకుడు, బోరు వేయించి తాగునీటి సమస్యను పరిష్కరించడంలో మాత్రం చొరవ చూపడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



మిషన్ భగీరథ నీటిని సరఫరా చేసేందుకు కాలనీలో నిర్మించిన ట్యాంకు

### బోరు వెంటనే వేయించాలి



గుట్ట ప్రాంతంలో చాలా మంది తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నరు. ఆరు నెలల క్రితం బోరు పైపులైన్ కోసం ఎమ్మెల్యే నిధులు మంజూరు చేసినా ఎవరూ పట్టించుకుంటలేరు. మిషన్ భగీరథ నీరు చాలా తక్కువగా వస్తున్నయ్. మా కాలనీలోని చిన్న ట్యాంక్ నుంచి నీరు సరిపోవడం లేదు. ఇంకో ట్యాంక్‌ను నిర్మించి వెంటనే బోరు వేయించాలి.

**- శోభ, రాంనగర్ గుట్ట ప్రాంత నివాసి**

### భగీరథ నీరు సరిపడా వస్తలేదు..



నెల రోజుల నుంచి మిషన్ భగీరథ నీళ్లు సరిపడా రావడంలేదు. వచ్చే ఆ కొద్ది నీళ్ల కోసం కోట్లాడుకోవాల్సి వస్తున్నది. మా సమస్యను ఎవరూ పట్టించుకుంటలేరు. నీళ్లు సరిపోక ఫిల్టర్ నీటిని కొనుక్కోవాల్సి వస్తున్నది. అధికారులు పట్టించుకొని తాగునీటి సమస్యను పరిష్కరించాలి.

**-లక్ష్మి, రాంనగర్ గుట్ట ప్రాంత నివాసి**

# 'ఎస్సారెస్పీ'ని టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేయాలి

- బాసర సరస్వతీ ఆలయం వరకు బోటు సౌకర్యం కల్పించాలి
- మోర్తాడ్‌లో న్యాక్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలి
- అసెంబ్లీలోమాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

మోర్తాడ్, మార్చి 25: ఎస్సారెస్పీ బ్యాక్‌షోర్(వెనుక తీర ప్రాంతం)లో బ్రహ్మాండమైన ఐలాండ్స్, చూడదగ్గ ప్రదేశాలు, అనేక జీవ జాతులు ఉన్నాయని, ఈ ప్రాంతాన్ని టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేయాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా ఆర్అండ్‌బీ, టూరిజం, ఎండోమెంట్, స్పోర్ట్స్ శాఖలపై మంగళవారం చర్చ నిర్వహించారు. ఈ సందర్భంగా వేముల బాల్కొండ నియోజకవర్గానికి సంబంధించి పలు సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. ఎస్సారెస్పీని టూరిజం



అసెంబ్లీలో మాట్లాడుతున్న వేముల

స్పాట్‌గా చేయాలని బీఆర్ఎస్ ప్రభుత్వహయాంలోనే ప్రతిపాదనలు చేశామని, ఇరిగేషన్ ట్యాండ్స్ టూరిజం వారికి బదిలీ కూడా చేసినట్లు తెలిపారు. ఈ ప్రతిపాదన ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నదని, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లికి కూడా విన్నవించినట్లు చెప్పారు. వెంటనే ఎస్సారెస్పీ బ్యాక్‌షోర్‌ను టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్‌పై భాగంలో బాసర సరస్వతీ పుణ్య క్షేత్రం ఉన్నదని, ప్రాజెక్టు నుంచి బాసర దేవాలయం వరకు బోటు సౌకర్యం కల్పించాలని విన్నవించారు.

### మోర్తాడ్‌లో న్యాక్ కేంద్రం ఏర్పాటు చేయాలి

ఉత్తర తెలంగాణలో నిరుద్యోగ యువత చాలా మంది ఉపాధి కోసం లేబర్ పనిమీద గల్ఫ్ వెళ్తుంటారని, ఏదైనా స్కిల్ వర్క్ నేర్చుకుని వెళ్తే వారికి వేతనం ఎక్కువగా లభిస్తుందన్న ఉద్దేశంతో మోర్తాడ్‌లో రూ.5కోట్లతో న్యాక్ సెంటర్ నిర్మాణం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. భూమిపూజ చేసి టెండర్ ప్రక్రియ కూడా పూర్తికాగా.. కానీ పనులను మంత్రి రద్దుచేశారని తెలిపారు. దానిని తిరిగి కొనసాగించి పనులు ప్రారంభమయ్యేలా చూడాలని కోరారు.

### ఆలయాల నిర్మాణాలు పూర్తిచేయాలి

బాల్కొండ నియోజకవర్గంలో పదేండ్లలో 52 దేవాలయాలు నిర్మించామని, ఇంకా 35 ఆలయాలు మంజూరై వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. ఎనిమిది ఆలయాల నిర్మాణ పనులు బిల్లురాక నిలిచిపోయాయని, అలాగే టెండర్ పూర్తయి అగ్రిమెంట్ కాని ఆలయాలు తొమ్మిది ఉన్నాయని వివరించారు. మంజూరై టెండర్లు పిలవాల్సిన దేవాలయాలు 17 ఉన్నాయని, వివిధ దశల్లో వీటిని క్లియర్ చేయాలని కోరారు.

### రద్దు చేసిన పనులను తిరిగి ప్రారంభించండి..

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కమ్మర్‌పల్లిలో మినీ స్టేడియం నిర్మించామని, ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరుచేయాలని కోరారు. ఆర్అండ్‌బీ శాఖలో గత ప్రభుత్వ హయాం లో మంజూరైన పనులు మందకొడిగా సాగుతున్నాయని తెలిపారు. ఏజెన్సీలకు పెండింగ్ బిల్లులు చెల్లించి ఆన్‌గోయింగ్ పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బాల్కొండ నియోజకవర్గంలో మంజూరైన అనేక అభివృద్ధి పనులను కాంగ్రెస్ సర్కార్ రద్దుచేసిందని తెలిపారు. అభివృద్ధి పనులపై ప్రజలు ఆశతో ఉన్నారని, వెంటనే కాకున్నా రానున్న మూడేండ్లలో వాటిని చేపట్టేలా చూడాలని కోరారు.

# పసిగుడ్డు విక్రయం

- పంపకాల్లో తేడా రావడంతో వెలుగులోకి..
- విక్రేతలు, కొన్నవారు, మధ్యవర్తులపై కేసు

కామారెడ్డి, మార్చి 25: కామారెడ్డిలో ఓ పసిగుడ్డును విక్రయించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పంపకాల్లో తేడా రావడంతో గొడవ జరగడం, పోలీసులు రంగంలోకి దిగడంతో శిశువు విక్రయించిన ఉదంతం బయట పడింది. కామారెడ్డి పట్టణ పోలీసుల కథనం ప్రకారం.. సోమవారం జిల్లా కేంద్రంలోని వీక్లీ మార్కెట్ సమీపంలో కొందరు గొడవ పడుతున్నట్లు పోలీసులకు సమాచారమందింది. దీంతో పెట్రోలింగ్‌లో ఉన్న ఏఎస్సై రంగారావు, కానిస్టేబుల్ వెంకటేశ్ అక్కడకు చేరుకున్నారు. ఏం జరిగిందని విచారించగా, మగ శిశువు విక్రయించిన విషయం వెలుగు చూసింది. దీంతో శిశు సంరక్షణ శాఖ అధికారులకు సమాచారమిచ్చి, దర్యాప్తు చేపట్టారు. క్యాసంపల్లికి చెందిన పల్లపు రాజమణి, నర్సింహులు దంపతులకు పుట్టిన శిశువును ఈ నెల 19న విక్రయించారు. మధ్యవర్తులు పిట్ల వెంకటి, రాములు సమక్షంలో సిరికొండ మండలంలోని ఓ గ్రామానికి చెందిన దంపతులు రూ.55 వేలకు పసిబిడ్డను కొనుగోలు చేశారు. అయితే, సోమవారం రాత్రి డబ్బు విషయంలో గొడవ జరిగింది. దీనిపై సమాచారమందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని వారిని అదుపులోకి తీసుకుని విచారించగా, పసిబిడ్డ విక్రయం వెలుగు చూసింది. విక్రయించిన బాబును స్వాధీనం చేసుకుని శిశుసంరక్షణ కేంద్రం నిర్వాహకులకు అప్పగించారు. శిశువును విక్రయించిన తల్లిదండ్రులతో పాటు కొనుగోలు చేసిన వారిపై, మధ్యవర్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. చాకచక్యంగా వ్యవహరించి శిశువును కాపాడిన ఏస్సై రంగారావు, కానిస్టేబుల్ వెంకటేశ్, హోంగార్డు బాలరాజ్, ఏఆర్ పీసీ లక్ష్మణ్‌ను ఎస్పీ రాజేశ్ చంద్ర మంగళవారం అభినందించారు.



మోస్రాలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఆశ కార్యకర్తలు

### అక్రమ అరెస్టులపై 'ఆశ'ల ఆగ్రహం

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 24న హైదరాబాద్‌లో ఆందోళన చేపట్టిన ఆశ కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేయడంపై బోధన్, మోస్రా మండల కేంద్రాల్లో సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన చేపట్టారు. మోస్రాలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేయగా.. బోధన్‌లో పోలీసులు అడ్డుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందని ఆశ కార్యకర్తలు మండిపడ్డారు.

–శక్కర్‌నగర్/చందూర్, మార్చి 25

# మున్సిపాలిటీగా బిచ్కుంద

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- బీఆర్ఎస్ హయాంలోనే పూర్తయిన ఏర్పాటు ప్రక్రియ
- ప్రతిపాదనలూ పంపించిన అప్పటి ఎమ్మెల్యే షిండే
- ఎన్నికల నేపథ్యంలో నిలిచిపోయిన వైనం
- కామారెడ్డి జిల్లాలో నాలుగుకు చేరిన బల్దియాల సంఖ్య



బిచ్కుంద, మార్చి 25: కామారెడ్డి జిల్లా లో మరో కొత్త మున్సిపాలిటీ ఏర్పాటు కానున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే బిచ్కుందను మున్సిపాలిటీగా ఏ ర్పాటు చేసే ప్రక్రియ పూర్తికాగా.. ఎన్నికలు రావడంతో బ్రేక్ పడింది. బిచ్కుంద మండలాన్ని మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తూ ప్రస్తుత ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. బిచ్కుంద టౌ న్, గోపన్‌పల్లి, కందర్‌పల్లి, దౌల్తాపూర్ గ్రామ పంచాయతీలను విలీనం చేస్తూ మున్సిపాలిటీగా ఏర్పాటు చేసింది.

### బీఆర్ఎస్ హయాంలోనే ఏర్పాటు ప్రక్రియ పూర్తి

బిచ్కుందను మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే కార్యాచరణ రూపొందించారు. నాటి ఎమ్మెల్యే హన్మంత్ షిండే ఆధ్వర్యంలో మూడు విలీన పంచాయతీలతో ప్రతిపాదనలు సైతం పంపించగా, ప్రభుత్వం ప్రత్యేక బృందాలను పరిశీలనకు పంపింది. దీంతో బిచ్కుంద మున్సిపాలిటీ ఏర్పా టు దిశగా అడుగులు వేగంగా పడ్డాయి. అంతలో ఎన్నికలు రావడం, రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో మున్సిపల్ ఏర్పాటు ప్రక్రియకు బ్రేక్ పడింది. బిచ్కుందను మున్సిపాలిటీగా ఏర్పాటు చేసేందుకు మళ్లీ గ్రామాల ఆమోదం పంపించాలని కొన్నినెలల క్రితం మండల కార్యాలయానికి ఉత్తర్వులు వచ్చాయి. దీంతో ఆయా గ్రామాల్లో అధికారులు సభలు నిర్వహించి నివేదికను పంపించారు. ఈ మేరకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బిచ్కుంద మున్సిపాలిటీ ఏర్పాటుపై అసెంబ్లీలో ప్రకటన చేశారు. దీంతో బిచ్కుంద ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.